PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

మంగళవారం TUESDAY 30.09.2025 | కరీంనగర్ KARIMNAGAR | పేజీలు : 4 pages : 4 | సంపుటి :1 || సంచిక :30 || ధర : 4.00 | అష్టమి

మంగళవారం, సూర్యోదయం: 5-45, సూర్యాస్తమయం: 6-44. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: షష్ఠి రాత్రి 12-36 వరకు. నక్షత్రం: విశాఖ ఉదయం 9-09 వరకు, తదుపరి అనురాధ, వర్జ్యం: పగలు 1-34 నుంచి పగలు 3-20 వరకు, రాహుకాలం: పగలు 3-25 నుంచి సాయంత్రం 5-02 వరకు.దుర్ముహూర్తం: ఉదయం 8-20 నుంచి ఉదయం 9-12 వరకు, పునర్ దుర్ము హూర్తం: రాత్రి 11-05 నుంచి రాత్రి 11-50 వరకు.అమృతకాలం: రాత్రి 12-14 నుంచి రాత్రి 2-01 వరకు.

CIRCULATED AT : WARANGAL , HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA ,ADILABAD, NIZAMABAD, RANGAREDDY, MAHABUBNAGAR, MEDAK

WWW.MEKARTHI DINAPATRIKA.COM

## ఎన్నికలకు సిద్ధమే


### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం



మేకార్తి దినపత్రిక,హైదరాబాద్ (సెప్టెంబరు 29) : స్థానిక సంస్థల ఎన్నికలకు తాము సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణలో వాతావరణం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉందని ఉద్ఘాటించారు.సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు టీటీడీపీ నేత ప్రదీప్ చౌదరి. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.6 గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ చేసిన గారడీని ప్రజలు మర్చిపోలేదని చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ కార్డులతో చేసిన గారడీలను గుర్తుచేసేందుకు తాము 'బాకీ కార్డులను' తీసుకెళ్తున్నామని తెలిపారు. బాకీ కార్డుతో కాంగ్రెస్ ప్రతి వర్గానికి పడిన బాకీని ఇంటింటికీ వెళ్లి గుర్తు చేస్తామని వివరించారు. కాంగ్రెస్ 'బాకీ కార్డులు' ఇంటింటికీ తీసుకుపోతే..అదే బీఆర్ఎస్‌కు బ్రహ్మాస్త్రమని నొక్కిచెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ఒక్కటంటే ఒక్క ఫ్లైఓవర్ కూడా ఎందుకు కట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు.సిటీ రోడ్లను కూడా కనీసం పట్టించుకోవడం లేదని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపిస్తారన్న నమ్మకముందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఎరువుల కోసం అన్నదాతలు లైన్లలో నిలబడి కొట్లాడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు మాజీ మంత్రి కేటీఆర్. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ చేసిన మోసంపై కోపంగా ఉన్నారని తెలిపారు. రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించిన నీరో చక్రవర్తిలాగా సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని ఎద్దేవా చేశారు. ఉన్న హైదరాబాద్ నగరాన్ని ఉద్ధరించే పరిస్థితి లేదు కానీ.. కొత్త నగరాన్ని కడతానని రేవంత్‌రెడ్డి ఫోజులు కొడుతున్నారని దెప్పిపొడిచారు. నగరంలో కనీసం మోరీలు శుభ్రపరిచే పరిస్థితి లేదని, వీధి దీపాలు వెలిగించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. మున్సిపల్ శాఖ మంత్రిగా విఫలమైన ముఖ్యమంత్రి.. మరో కొత్త నగరం కడతానని పోజులు కొడుతున్నారని విమర్శించారు. ఒకప్పుడు తెలుగువారు దేశంలో ఉన్నారని ఎన్టీఆర్ నిరూపిస్తే.. దేశంలో తెలంగాణ వారున్నారని కేసీఆర్ నిరూపించారని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## బతుకమ్మకు 2 ప్రపంచ రికార్డులు



మేకార్తి దినపత్రిక, హైదరాబాద్: తెలంగాణ బతుకమ్మ సంబరాలు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సను సొంతం చేసుకున్నాయి. ఏకంగా రెండు గిన్నిస్ రికార్డులను సాధించి చరిత్ర సృష్టించాయి. హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో మహా బతుకమ్మ కార్యక్రమాన్ని అధికారులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కోసం 10 వేల మందితో బతుకమ్మ వేడుకను అధికారులు చేపట్టారు. మహా బతుకమ్మ దగ్గర గిన్నిస్ బుక్ రికార్డు సభ్యుల పర్యవేక్షణ చేశారు. ఈ నేపథ్యంలో మహా బతుకమ్మ కార్యక్రమం ఏకంగా రెండు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకుంది. అతిపెద్ద జానపద నృత్యంగా తెలంగాణ బతుకమ్మ ఒక గిన్నిస్ రికార్డు సాధించింది. మరో రికార్డుగా 66.5 అడుగుల భారీ బతుకమ్మ చుట్టూ ఒకేసారి 1,354 మంది మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆడి మరో గిన్నిస్ రికార్డు క్రియేట్ చేశారు.

ఈ మేరకు తెలంగాణ బతుకమ్మ వేడుకకు 2 గిన్నిస్ రికార్డులు దక్కాయి. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి బతుకమ్మ వేడుక నమోదైంది. పది వేల మంది మహిళలు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ.. పాటలు పాడుతుండగా గిన్నిస్ బుక్ ప్రతినిధులు వివరాలను నమోదు చేసుకుని ఫలితాన్ని ప్రకటించారు. ఒకేసారి పది వేల మందితో బతుకమ్మ ఆడించి గిన్నిస్ రికార్డుల్లో స్థానం దక్కించుకోవడమే లక్ష్యంగా మహా బతుకమ్మ కార్యక్రమం కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ మేరకు అధికారుల అంచనాలను మించి మహా బత్తుకమ్మ రెండు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకుంది.

## బీసీలకు దసరా కానుక

## 42% రిజర్వేషన్లు



మేకార్తి దినపత్రిక,హైదరాబాద్ (సెప్టెంబర్ 29) : ప్రజలందరికీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం గాంధీభవన్‌లో మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. దసరా కంటే ముందే బీసీ బిడ్డలకు పండుగ వాతావరణం వచ్చిందన్నారు. మాతృమూర్తికి ప్రసవ వేదన అనేది ప్రకృతి ఇచ్చిన వరమని.. అలాగే 42 శాతం రిజర్వేషన్లు బీసీ బిడ్డలకు ఇచ్చిన వరంగా పేర్కొన్నారు. 'మేము ఎంతో మాకు అంతా వాటా' అని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన చేశారని.. కులగణన ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని... ఎవరి నోటి కాడ ముద్ద లాక్కోవడం లేదని స్పష్టం చేశారు. వాస్తవానికి బీసీలకు రిజర్వేషన్లలో ఇంకా వాటా రావాలి కానీ కుదించుకొని 42 శాతం రావాలి అని అడుగుతున్నామని చెప్పుకొచ్చారు.

పార్టీ మెప్పు కోసం,నాయకుల మెప్పు కోసం ఎవరూ మాట్లాడి సమాజంలో తలవంపులు తెచ్చుకోవద్దని అన్ని పార్టీల బీసీ నాయకులకు తాము కోరుతున్నామన్నారు. ఇది న్యాయపరమైన కోరికగా వెల్లడించారు.రిజర్వేషన్లు అమలు కాకపోతే బీసీ బిడ్డలు ఇంకా వెనకబడిపోతారన్నారు. జయలలిత బీసీ రిజర్వేషన్లు పెంచి 9 షెడ్యూలు పెట్టినప్పుడు జయలలిత పార్టీ కేంద్రంలో అధికారంలో లేదని తెలిపారు. రాష్ట్రాల్లో ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టి కేంద్రం బిల్లుకు ఆమోదం తెలపాలని అన్నారు. 'అంతేకాని మీరే హామీ ఇచ్చారు.... మీరే చేయాలి అని బట్ట కాల్చి మీద వేస్తాం అంటే ఎలా?' అని మండిపడ్డారు. రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని ప్రయత్నాలు చేశామని....ఇప్పుడు కేంద్రం చేయాలన్నారు. అది చేయకపోగా అనుమానాలు ఉన్నాయి అంటున్నారని... అనుమానాలు ఉంటే వ్యక్తం చేయమని కూడా చెప్పామన్నారు.అవేమీ చేయకుండా బీజేపీ నాయకులు కాళ్లలో కట్టే పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీసీ బిడ్డలందరికీ పోటీ చేసే అవకాశం దొరికింది... దయచేసి అన్ని వర్గాలు సహకరించాలని,42 శాతం రిజర్వేషన్లు వ్యతిరేకించి బీసీ బిడ్డల ఆగ్రహానికి గురికావద్దని మంత్రులు పొన్నం ప్రభాకర్,శ్రీహరి కోరారు.

## ముగిసిన మొదటి రోజు విచారణ

### స్పీకర్ ఛాంబర్‌లో కొనసాగిన విచారణ



మేకార్తి దినపత్రిక,హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు మొదటి రోజు విచారణ ముగిసింది. సోమవారం ఉదయం 11 గంటల నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్లో విచారణ కొనసాగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేల తరుపు న్యాయవాదులు పిటిషన్ దారులను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు.విచారణకు పిటిషనర్లు కల్వకుంట్ల సంజయ్,చింతా ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి,వారి తరపు న్యాయవాదులు హాజరయ్యారు.అలాగే..ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్,కాలే యాదయ్య, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి,మహిపాల్ రెడ్డి,వారి తరుపు న్యాయవాదులు విచారణలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీ స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్నా స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ.. సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం కీలక ఆదేశాల జారీ చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది తాము పార్టీ మారలేదంటూ అఫిడవిట్ల పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులూ వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు నాలుగు రోజులు ఎమ్మెల్యేల విచారణ కొనసాగనుంది. దీనిలో భాగంగా మొదటి రోజు విచారణ ముగిసింది. కాగా, విచారణ అనంతరం స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా..? లేదా సుప్రీంకోర్టును మరికొంత సమయం కోరుతారా..? అనేది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## ఎన్నికల షెడ్యూల్ విడుదల



మేకార్తి దినపత్రిక,హైదరాబాద్ (సెప్టెంబరు29): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ తర్వాత వార్డులు, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనుంది ఎన్నికల సంఘం. అయితే రాష్ట్ర హైకోర్టు స్టే కారణంగా తెలంగాణలో 14 ఎంపీటీసీ, 27 గ్రామపంచాయతీలు, 246 వార్డులకు ఎన్నికలు వాయిదా పడనున్నాయి.

మూడు విడతల్లో పంచాయతీ వార్డు ఎన్నికలు..

కాగా, మూడు విడతల్లో గ్రామపంచాయతీ వార్డు ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడతలో 1998 గ్రామపంచాయతీలు ఉండగా.. 17 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. రెండో విడతలో 5414 గ్రామపంచాయతీలు ఉండగా.. 47,890 వార్డులకు ఎన్నికలు నిర్వహించనుంది ఎన్నికల సంఘం. మూడో విడతలో 5521 గ్రామపంచాయతీలు ఉండగా.. 47,788 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి.

రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు...

రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడతలో 2963, రెండో విడతలో 2786 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుంది ఎన్నికల సంఘం. మొదటి విడతలో 292, రెండో విడతలో 273 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి.

## ప్రయాణికులతో బస్టాండ్ల కిటకిట



మేకార్తి దినపత్రిక, హైదరాబాద్ (సెప్టెంబర్ 29) : భాగ్యనగర వాసులు పల్లెబాట పడుతున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగ కోసం ప్రజలు సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో సిటీలో బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికే స్కూళ్లకు దసరా సెలవులు ప్రకటించేశారు. అయితే నిన్నటి వరకు నగరంపై వరణుడి ప్రతాపం కొనసాగింది. కొద్దిరోజులుగా నగర వ్యాప్తంగా భారీ వర్షాలు పడటంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాని పరిస్థితి. అయితే నిన్నటి నుంచి వరుణుడు కాస్త కనుకరించాడు. దీంతో పండుగకు మూడు రోజులే ఉండటంతో నగర ప్రజలు సొంతూళ్ల బాట పట్టారు. నగరంలోని ప్రతీ బస్టాండ్‌లో ప్రయాణికుల సందడి నెలకొంది.


మరోవైపు దసరా కోసం టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. దాదాపు ఏడువేలకు పైగా బస్సులను నడిపిస్తోంది ఆర్టీసీ. అలాగే స్పెషల్ బస్సుల్లో 50శాతం అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. అటు ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్ బస్టాండ్లతో పాటు ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ కొనసాగుతోంది. గత ఏడాది కంటే ఈసారి ఆర్టీసీ 600 అదనపు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసింది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి ఏపీ, కర్ణాటక మహారాష్ట్రలకు టీజీఎస్ ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడిపించనుంది.



## పంచాయితీ కార్యదర్శులకు నిధుల విడుదల

మేకార్తి దినపత్రిక,హైదరాబాద్ (సెప్టెంబరు29): తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. పంచాయతీ కార్యదర్శులకు గుడ్ న్యూస్ చెప్పింది. రూ. 104 కోట్ల పంచాయతీ కార్యదర్శుల బిల్లులు విడుదల చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. మరికాసేపట్లో వారి ఖాతాల్లో జమ కానున్నాయి నిధులు. ఎప్పుడు లేని విధంగా పంచాయతీ కార్యదర్శులకు ఏకకాలంలో రూ. 104 కోట్లు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు పంచాయతీంరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి




మేకార్తి దినపత్రిక,నల్గొండ, సెప్టెంబర్ 29: నల్గొండ జిల్లా చింతపల్లి మండలం నసర్లపల్లి గేటు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై ఆటో, కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులతోపాటు అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని.. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని అత్యవసర చికిత్స కోసం దేవరకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అయితే బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఇక మృతదేహాలను సైతం స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో వీరంతా దేవరకొండ మండలం ముదిగొండ అవాసం మటిక తండా వాసులుగా పోలీసులు గుర్తించారు. మృతులు.. రాత్లావత్ భాస్కర్ (29), రాత్లావత్ వినోద్ (29), సఫవత్ రవి (29)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

మేకార్తి దినపత్రిక
PRGI NO: TGTEL/25/A2356
30- 09 -2025 మంగళవారం
WWW.MEKARTI DINAPATRIKA.COM

## సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ 29
చేర్యాల ప్రతినిధి కర్రోల్ల నవజీవన్.

పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే మన సంస్కృతిని ప్రతిబింబిస్తూ... ఇంటిల్లిపాదీ ఏకమై రంగురంగుల పూలను పేర్చి, ఊరువాడ ఒక్కచోట చేరి... మన ఆడబిడ్డలు ఎంతో ఆనందంగా జరుపుకునే బతుకమ్మ పండుగ అని చేర్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు వంగ జయ అన్నారు. ఈ సందర్భంగా.. తెలంగాణ ఆడబిడ్డలందరికీ మా జనగామ నియెజక వర్గ ఆడబిడ్డలందరికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేసినారు.

## ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ప్రకృతి వన పార్కులో శ్రమదానం



**మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ 29**
**చేర్యాల ప్రతినిధి కర్రోల్ల నవజీవన్.**

చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి. మధు ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లిలో చేపట్టిన 7 రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా స్కూల్కు దగ్గరగా ఉన్న ప్రకృతి మన పార్కులు శ్రమదానం చెయ్యడం జరిగింది. ఈ పార్కు అంతటను దట్టంగా పెరిగిన కలుపు మొక్కలను దారి కనపడకుండా విస్తరించియుండెను. మా విధార్థిని, విద్యార్థులు మొక్కవోని ధైర్యంతో , అకంటిత దీక్షతో పార్కులోని దారులను శుభ్రం చేసి మునుపటి కళను తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెడ్ మాస్టర్ కనకయ్య మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.334 కోట్ల అవినీతి చైనా మాజీ మంత్రికి మరణశిక్ష




**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ప్రతినిధి**

చైనా రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. అవినీతి చర్యల్లో భాగంగా మాజీ మంత్రి టాంగ్ రెన్‌జియాన్‌కు మరణశిక్ష విధించింది. రూ. 334 కోట్ల మేర లంచాలు తీసుకున్న వ్యవహారంలో ఆయన పై ఈ మేరకు చర్యలు తీసుకుంది. అదేవిధంగా ఆయన రాజకీయ కార్యకలాపాలపై జీవితకాల నిషేధం విధిస్తూ.. జిలిన్ ప్రావిన్స్‌లోని కోర్టు తీర్పు చెప్పింది. ఆయన వ్యక్తిగత ఆస్తులను జప్తు చేయాలని, లంచం సొత్తునూ స్వాధీనం చేసుకుని దేశ ఖజానాకు అప్పగించాలని ఆదేశించిందిది

## భారత్ విజయంపై ప్రధాని మోదీ ప్రశంసలు






మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ప్రతినిధి

ఆసియా కప్‌లో భారత్ విజయంపై ప్రధాని మోదీ జి ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ యుద్ధభూమిలోనూ, మైదానంలోనూ ఒక్కటే ఫలితం అని పేర్కొన్నారు. మైదానంలోనూ 'ఆపరేషన్ సిందూర్ ఎక్కడైనా ఫలితం ఒక్కటే. భారత్ మళ్లీ గెలిచింది. భారత క్రికెటర్లకు అభినందనలు తెలిపారు

## ప్రజా కేంద్రీకృత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

హైదరాబాద్,**మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ 29** :

పోలీస్ అధికారులు ప్రజాకేంద్రీకృత పోలీసింగ్ (సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్) కు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం డీజీపీ కార్యాలయంలో కార్యాలయ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ డీజీపీ డాక్టర్ జితేందర్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ొ%.. తెలంగాణ రాష్ట్ర డీజీపీగా 14 నెలలపాటు పనిచేసినందుకు గర్వపడుతున్నానని అన్నారు.

విధి నిర్వహణలో తాను ప్రజా కేంద్రీకృత పోలిసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చానని చెప్పారు. పోలీస్ సిబ్బంది సైతం సామాన్య ప్రజలలో భాగస్వాములు కాబట్టి వారిని కేంద్రీకృతంగా చేసుకొని పలు రకాల చర్యలు చేపట్టినట్లు డీజీపీ తెలిపారు. పోలీస్ సిబ్బంది, అధికారుల కృషివల్ల తాను డీజీపీగా ఉన్నప్పుడు ఇండియా జస్టిస్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ రాష్ట్రం భారతదేశంలోనే నెంబర్ వన్‌గా పేరు తెచ్చుకోవడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ చిత్తశుద్ధితో పనిచేసి తెలంగాణ పోలీస్ శాఖ స్థాయిని కొనసాగించాల్సి ఉందని అన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పోలీస్ సిబ్బంది మరింత మెరుగ్గా రాణిస్తున్నారని డీజీపీ జితేందర్ చెప్పారు. రాష్ట్ర పోలీస్ శాఖకు ప్రధాన కార్యాలయంగా ఉన్న డీజీపీ కార్యాలయ ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని అన్నారు. శాంతిభద్రతల అడిషనల్ డీజీపీ శ్రీ మహేష్ భగవత్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల అడిషనల్ డీజీపీగా తాను, డీజీపీ జితేందర్ ఒకేరోజు ఉద్యోగ బాధ్యతలు బాధ్యతలు స్వీకరించామని తెలిపారు.




డీజీపీ తన విధి నిర్వహణలో భాగంగా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ కోసం క్యూఆర్ కోడ్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ల మీట్, యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు, టూరిజం పోలీస్, ఇండియా జస్టిస్ రిపోర్టు ప్రకారం తెలంగాణకు ప్రథమ స్థానం వంటి ఎన్నో చర్యలు చేపట్టారని తెలిపారు. మల్టీజోన్‌ల ఐజీపీలు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, తఫ్సీర్ ఇక్బాల్, ఐజీపీలు ఎం రమేష్, రమేష్ నాయుడు, ఎం శ్రీనివాసులు, సీఐడీ ఎస్పీ నవీన్ కుమార్, డీజీపీ కార్యాలయ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షులు సీ పవన్, ప్రధాన కార్యదర్శి శ్రీమతి హరిణి, కల్చరల్ సెక్రెటరీ శ్రీమతి శివరంజని, అధికారులు, సిబ్బంది తదితరులు ఈ వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు.

## అక్టోబర్ 1 నుండి రేషన్ షాపులు బంద్

మేకార్తీదినపత్రిక సెప్టెంబర్ 29
సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల నవజీవన్

రేషన్ డీలర్లకు కమిషన్ పెంచి, పెండింగ్లో ఉన్న ఆరు నెలల కమిషన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 1 నుండి రేషన్ షాపులను బంద్ చేయడం జరుగుతుందని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మంద లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగరి నాగరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ హైమావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేషన్ డీలర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, గత 6 నెలలలు గా పెండింగ్ లో ఉన్న కమిషన్ డబ్బులు దసరా పండుగ వరకు వచ్చేల, ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన డీలర్లు కి రూ. 5000 కనీస గౌరవ వేతనం, క్వింటాల్ కి రూ. 300 కమిషన్ విడుదల చేయడం పలు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కమిషన్ ఇవ్వక రేషన్ దుకాణ కిరాయిలు, హెల్పర్ కు ఇచ్చే డబ్బులు, హమాలీల కూలీ డబ్బులు కట్టలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి కట్టాల్సిన పరిస్థితి ఉందని ఆయన అన్నారు. వెంటనే రేషన్ డీలర్లకు పెండింగ్ లో ఉన్న కమిషన్ ను, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని



డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే అక్టోబర్ 1 నుండి రేషన్ దుకాణాలను బందు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలార్లు అజీజ్ బొజ్జ నరేందర్ తిరుపతి రమేష్ మొన్నయ్య నాగరాజు చంద్రం బాల నరసయ్య శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య



మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ప్రతినిధి

హనుమకొండ జిల్లా నర్సింహులపల్లిలో బీటెక్ పూర్తి చేసి రెండేళ్లుగా ఉద్యోగం కోసం ట్రై చేసినా రాకపోవడంతో మనస్తాపానికి గురైన హరీష్ (26) అనే యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సెప్టెంబర్ 24న గడ్డి మందు తీసుకున్న హరీష్, తన తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. తల్లిదండ్రులు వరంగల్కు వెళ్లి అతన్ని పరకాల ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.

## మంచిర్యాల జోరుగా కల్తీ నూనెల విక్రయాల దందా



మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ మంచిర్యాల

మంచిర్యాల జిల్లాలో కల్తీ నూనెల విక్రయాల దందా జోరుగా సాగుతోంది.
నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న ప్రజలు కల్తీ నూనెలతో మరింత ఇబ్బందులు పడుతున్నారు.
అసలు నూనె ఏదో, కల్తీ నూనె ఏదో తెలియక ప్రజలు అయోమయంలో పడుతున్నారు.
కొందరు వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ, కొత్త పేర్లతో కల్తీ నూనెలను అమ్ముతున్నారు.
కల్తీని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.
మంచిర్యాల జిల్లా కేంద్రంగా బెల్లంపల్లి పరిసర ప్రాంతాలకు హెూల్‌సేల్ అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం.

## తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షాలు



మేకార్తి దినపత్రిక, హైదరాబాద్:

రాష్ట్రాన్ని ఇప్పట్లో వర్షాలు వదిలేలా లేవు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. దాంతో వాగలు వంకలు ఉప్పొంగుతున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభిస్తున్నది. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు చేసింది. తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గల్ఫ్ ఆఫ్ కాంబే, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు దక్షిణ గుజరాత్ విదర్భ, దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశా, కోస్తాంధ్ర మీదుగా సగుట సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని తెలిపింది. ఇక తెలంగాణలో సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. మంగళశారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. అలాగే, బుధ, గురువారాల్లోనూ హైదరాబాద్, రంగారెడ్డి సహా ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయని వాతావరణశాఖ వివరించింది.

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఎం హరిత



మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ -29 సిరిసిల్ల ప్రతినిధి

జిల్లా కలెక్టర్ గా ఎం హరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు జిల్లా సమీకృత కార్యాలయానికి రాగా అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్ లో కలెక్టర్ ఎం హరిత బాధ్యతలు స్వీకరించారు అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.
అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.
కార్యక్రమంలో ఏఓ రాంరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్లు మావి సీట్లు మీకా?

మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ 29
చేర్యాల ప్రతినిధి కర్నూలు నవజీవన్.

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామానికి సర్పంచ్ రిజర్వేషన్ కేటాయించాలని గట్టి డిమాండ్ ఉత్పన్నమైంది.

స్వాతంత్రము వచ్చి 77 సంవత్సరాలు అవుతున్నది ఇప్పటివరకు దళిత సర్పంచ్ కాలేదు

ముస్త్యాల గ్రామంలో ఒక్కసారి కూడా ఎస్సీ రిజర్వేషన్ ప్రకారం సర్పంచ్ హక్కు రాకపోవడం దళితులపై జరిగిన ఘోర అన్యాయం అని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 500కుపైగా ఓటర్లు, 77 దళిత కుటుంబాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు సర్పంచ్ పదవిని దళితులు అందుకోలేకపోవడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు.

ఈ సందర్భంగా విక్రమ్ సొంటే మాట్లాడుతూ

"ఓట్లు మావి %-% సీట్లు మీకా?" అనే ప్రశ్నకు రాజకీయ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగం ఇచ్చిన హక్కులు దళితులకు తప్పనిసరిగా ఇవ్వాలని, రాబోయే ఎన్నికల్లో ముస్త్యాల గ్రామానికి దళిత సర్పంచ్ రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.

న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు. "రాజ్యాధికారం రాని జాతి అంతరించి పోతుంది" అన్న బహుజన



నాయకుడు కాన్షీరాం మాటలను గుర్తుచేస్తూ, ముస్త్యాల గ్రామ దళితుల హక్కు కోసం తాను ఎల్లప్పుడూ పోరాడతానని విక్రమ్ సొంటే స్పష్టం చేశారు.

మేకార్తి దినపత్రిక

30- 09 -2025 మంగళవారం

# స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల




**మొత్తం ఐదు విడుతల్లో నిర్వహణ**
**రెండు విడుతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు**
**ఆ తరువాత మూడు విడుతల్లో పంచాయతీ ఎలక్షన్లు**
**అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల**
**అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభం**
**తక్షణమే అమల్లోకి ఎన్నికల కోడ్**

మేకార్తి దినపత్రిక, సెప్టెంబరు 29:

ఎప్పుడె ప్పుడా అని ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నిక లకు ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. స్థానిక సంస్థల ఎన్నికలను మొత్తం ఐదు విడుతల్లో నిర్వహిం చేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు విడుతల్లో జడ్పీటీసీ, ఎం పీటీసీ ఎన్నికలు జరుగనుండగా, పంచాయతీ ఎన్నిక లను మూడు విడుతలుగా నిర్వహించనున్నారు. వాస్త వానికి లోక్‌సభ ఎలక్షన్లు ముగియగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్ర భుత్వం అధికారంలోకి రావడం, పాలనపై పట్టు సాధిం చేందుకు కొంత సమయం పట్టింది. దీంతో స్థానిక సం స్థల ఎన్నికల నిర్వహణలో సంవత్సరం పాటు జాప్యం జరిగింది. గ్రామ పంచాయతీల పాలన గత సంవత్స రం జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల ప రిషత్‌ల పాలక వర్గాల పదవీకాలం జూలైతో ముగి సిం ది. ఏడాది సుదీర్ఘ సమయం దాటిన తరువాత ఎట్టకే లకు మార్గం సుగమం కావడంతో పల్లెల్లో ఎన్నికల సం దడి నెలకొంది. జిల్లాలో మొత్తం 16 మండలాలు ఉండ గా.... జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు కూడా అంతే మొత్తం లో ఉన్నాయి. అలాగే ఎంపీటీసీ స్థానాలు 129 ఉన్నా యి. మొత్తం ఎంపీటీసీ స్థానాలకుగాను బీసీలకు 54, ఎస్సీలకు 33, ఎస్టీలకు 14, జనరల్‌కు 28 కేటాయిం చారు. అలాగే 306 సర్పంచ్ స్థానాల్లో బీసీలకు 109, ఎస్సీలకు 81, ఎస్టీలకు 65, జనరల్‌కు 51 స్థానాలను కేటాయించారు. ఎలక్షన్ షెడ్యూల్ విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి వచ్చింది.

జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు ఇలా...

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదట జడ్పీ టీసీ, ఎంపీపీ ఎలక్షన్లు నిర్వహించనున్నారు. ఇందుకు గాను ఇటీవల మండలాల వారీగా అభ్యర్థులకు కేటా యించిన రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు.

| స్థానం | జడ్పీటీసీ | ఎంపీపీ |
|---|---|---|
| జన్నారం | ఎస్టీ(జనరల్) | బీసీ(మహిళ) |
| మందమర్రి | ఎస్టీ(మహిళ) | ఎస్టీ(మహిళ) |
| బెల్లంపల్లి | ఎస్సీ(మహిళ) | ఎస్సీ(మహిళ) |
| భీమారం | ఎస్సీ(జనరల్) | ఎస్టీ(జనరల్) |
| హాజీపూర్ | ఎస్సీ(మహిళ) | ఎస్సీ(జనరల్) |
| నెన్నెల | ఎస్సీ(జనరల్) | ఎస్సీ(జనరల్) |
| చెన్నూరు | బీసీ(మహిళ) | బీసీ(మహిళ) |
| దండేపల్లి | బీసీ(జనరల్) | జనరల్(మహిళ) |
| జైపూర్ | బీసీ(జనరల్) | బీసీ(జనరల్) |
| కన్నెపల్లి | బీసీ(మహిళ) | ఎస్సీ(మహిళ) |
| కాసిపేట | బీసీ(జనరల్) | బీసీ(మహిళ) |
| తాండూరు | బీసీ(మహిళ) | జనరల్ |
| వేమనపల్లి | బీసీ(జనరల్) | బీసీ(జనరల్) |
| భీమిని | జనరల్ | జనరల్ |
| కోటపల్లి | జనరల్ | బీసీ(జనరల్) |
| లక్షెట్టిపేట | జనరల్(మహిళ) | బీసీ(జనరల్) |

జిల్లాలో 3.7 లక్షల ఓటర్లు...

పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో తుది ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 3,76,669 ఓటర్లు ఉ న్నారు. వీరిలో స్త్రీలు 1,91,011 మంది ఉండగా, పురుషులు 1,85,643, ఇతరులు 15 మంది ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు...

| మండలం | మొత్తం | పురుషులు | స్త్రీలు | ఇతరులు |
|---|---|---|---|---|
| బెల్లంపల్లి | 23464 | 11625 | 11838 | 01 |
| భీమిని | 11529 | 5844 | 5684 | 01 |
| భీమారం | 13093 | 6394 | 6699 | 00 |
| చెన్నూర్ | 26475 | 13040 | 13435 | 00 |
| దండేపల్లి | 42101 | 20486 | 21614 | 01 |
| హాజీపూర్ | 16954 | 8361 | 8593 | 00 |
| జైపూర్ | 30626 | 15278 | 15347 | 01 |
| జన్నారం | 44412 | 21670 | 22740 | 02 |
| కన్నెపల్లి | 15490 | 7614 | 7875 | 01 |
| కాసిపేట | 26472 | 13127 | 13342 | 03 |
| కోటపల్లి | 26990 | 13320 | 13668 | 02 |
| లక్షెట్టిపేట | 25227 | 12261 | 12966 | 00 |
| మందమర్రి | 11482 | 5678 | 5803 | 01 |
| నెన్నెల | 19371 | 9636 | 9734 | 01 |
| తాండూర్ | 27757 | 13741 | 14016 | 00 |
| వేమనపల్లి | 15226 | 7568 | 7657 | 01 |

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు...

మొదటి విడుత....

మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ మొ దటి విడుత అక్టోబర్ 9వ తేదీన విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జాబితా ప్రదర్శన, 11న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 12న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన అభ్య ర్థుల జాబితా విడుదల, 13న అప్పీళ్లకు గడువు, 14న అప్పీళ్ల పరిష్కరణ, 15న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, 23న ఎన్ని కల నిర్వహణ, నవంబరు 11న ఓట్ల లెక్కింపు

రెండో విడత...

అక్టోబర్ 13వ తేదీన మండల, జిల్లా పరిషత్ ఎన్ని కల నోటిఫికేషన్ రెండో విడుత విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జా బితా ప్రదర్శన, 15న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 16న నామినేషన (

పరిశీలన, చెల్లుబాటైన అభ్యర్థుల జా బితా విడుదల, 17న అప్పీళ్లకు గడువు, 18న అప్పీళ్ల ప రిష్కరణ, 19న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అ భ్యర్థుల తుది జాబితా విడుదల, 27న ఎన్నికల నిర్వ హణ, నవంబరు 11న ఓట్ల లెక్కింపు

గ్రామ పంచాయతీ ఎన్నికలు...

మొదటి విడుత...

మొదటి విడుత గ్రామ పంచాయతీ ఎన్నికలకుఅక్టోబర్ 17వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం కానుంది. ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. 19న నామినేషన్ల దాఖలు కు చివరి తేదీ, 20న నామినేషన్ల పరిశీలన, చెల్లుబా టైన అభ్యర్థుల జాబితా విడుదల, 21న అప్పీళ్లకు గడు వు, 22న అప్పీళ్ల పరిష్కరణ, 23న నామినేషన్ల ఉప సంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, 31న ఎన్నికల నిర్వహణతో పాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరపనున్నారు.

రెండో విడుత...

అక్టోబర్ 21న రెండో విడుత విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జా బితా ప్రదర్శన, 23న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 24న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల జాబితా విడుదల, 25న అప్పీళ్లకు గడువు, 26న అప్పీళ్ల పరిష్కరణ, 27న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, నవంబరు 4వ తేదీన ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు

మూడో విడుత...

అక్టోబర్ 25వ తేదీన మూడో విడుత విడుదల కా నుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జాబితా ప్రదర్శన, 27న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 28న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల జాబితా విడుదల, 29న అప్పీళ్లకు గడువు, 30న అప్పీళ్ల పరిష్కరణ, 31న నామినేషన్ల ఉపసంహ రణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, నవం బరు 8వ తేదీన ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.

# ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 29:

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందించిన శిక్షణ కార్యక్రమానికి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని తెలిపారు. నోటిఫికేషన్ విడుదల అయినందున ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు తమకు ఇచ్చిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతీఅంశంపై అవగాహన కలిగి ఉ



ండాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. న్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



మేకార్తి దిన పత్రిక సెప్టెంబర్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని బంధనకల్ గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మతో ముగిసింది. తంగేడు, గునుగ పువ్వులు మరియు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ప్రత్యేక అలంకరణలో అలంకరించారు. చివరి రోజు అయిన ఈ రోజు ఆడపడుచులు అందరూ చక్కగా దుస్తులు, ఆభరణాలు ధరించి బతుకమ్మ ఆడుతూ, ప్రతి ఒక్క మహిళ ఆట పాటలతో అమ్మవారిని ఆరాధిస్తూ సంతోషంగా జరుపుకున్నారు. అందరూ కలిసి ఊరిలో ఉన్న పెద్ద చెరువు దగ్గరకు ఊరేగింపుగా బయలుదేరి ఈ ఊరేగింపు కొనసగినంత సేపు జానపద పాటలతో వీధులు మారుమోగాయి. చెరువు దగ్గరకు చేరుకొని, మెల్లిగా బతుకమ్మలను పాటలు పాడుతూ జారవిడిచారు. తరువాత నిమజ్జనం చేసి మలిద, సత్తుపిండి, నువ్వులసద్ది, కొబ్బరిసద్ది ఇలా వివిధ రకాలైన సద్దులు తయారు చేసి ఒకరికి ఒకరు ప్రసాదంగా పంచుకోవడం జరిగింది. ఖాళీ తంబాలంతో పదుతూ బతుకమ్మను కీర్తిస్తూ ఇంటికి చేరారు. కొంత మంది ఆడపడుచులు అందరూ అత్తవారింటి నుంచి కన్నవారింటికి వచ్చి మరి పండగను ఘనంగా నిర్వహించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టిన సిఐ

మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ 29

చేర్యాల ప్రతినిధి కర్రోళ్ల నవజీవన్.

చేర్యాల పట్టణంలో గత కొన్ని రోజుల నుండి కురిసిన భారీ వర్షాలతో కొత్త బస్టాండ్ నుండి గాంధీ చౌరస్తా వరకు వాహనదారులకు ఇబ్బందికరంగా ఉ న్నందున ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాపాయం జరిగే అవకాశం ఉ న్నందున సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి చేర్యాల సిఐ శ్రీను, ఎస్ఐ నవీన్, కొత్త బస్టాండ్ నుండి గాంధీ చౌరస్తా వరకు డస్టు మరియు చిన్న కంకరతో గుంతలను మొత్తం పూడ్చివేయడం జరిగింది.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని చేర్యాల సీఐ శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు.



# బత్తిని రఘుకు శాలువాతో ఘనంగా సన్మానం

## గ్రూప్-2 పరీక్షలో అర్హత సాధించి ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఎస్సైగా ఎంపిక

మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని పోతుగల్ గ్రామానికి చెందిన బత్తిని అండాలు అంజయ్య గౌడ్ కుమారుడు బత్తిని రఘు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలో అర్హత సాధించిన రఘు హెూదాలో ఎంపిక కావడం గర్వకారణం.

ఈ విజయాన్ని పురస్కరించుకొని ఆయనను సత్కరించి శాలువాతో ఘనంగా గౌరవించాము.

రఘు కృషి, పట్టుదల, క్రమశిక్షణతో సాధించిన ఈ ఉద్యోగం యువతకు ప్రతిభా శక్తి, కృషి ఫలితాలు ఎంత గొప్పవో చాటిచెప్పింది. భవిష్యత్తులో గ్రామం, ప్రాంతం యువత రఘును ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ ఉద్యోగాల కోసం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాము.

రాష్ట్ర అభివృద్ధి, సమాజ ప్రగతికి ఇలాంటి ప్రతిభావంతులైన యువత మరింతగా ముందుకు రావాలని ఆకాంక్షిస్తున్నాము. ఈ కార్యక్రమంలో



పాల్గొన్న వారు పెద్ది గారి శ్రీనివాస్, ఓరగంటి తిరుపతి, పారిపెల్లి శ్రీనివాస్, జంగరాజు, వంగ దేవయ్య, బొబ్బిలి రాజశేఖర్, పాల్గొన్నారు...

# అంబరాన్ని అంటిన సంబరాలు

**ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మ వేడుకలు**
**బతుకమ్మ పాటలతో మారుమోగిన జిల్లా**

మేకార్తి దినపత్రిక, ఆసిఫాబాద్ (సెప్టెంబరు 29):

సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. హరిహరి ఓ దేవ ఉయ్యాలో.. హరి యో బ్రహ్మదేవ ఉయ్యాలో.. అంటూ మహిళలు బతుకమ్మ పాటలతో హెూరెత్తించారు. ఆలయ ప్రాంగణాల్లో, వీధులు, కూడళ్ల వద్ద మహిళలు బతుకమ్మ ఆటల సం దడి కనువిందు చేసింది. చిన్నా పెద్ద తేడా లేకుండా మహిళలు సంప్రదాయ వస్త్రాలంకరణలతో లయబద్ధంగా ఆడుతూ.. పాడుతూ.. సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు పోటీపడి విభిన్న రూపాల్లో బతుకమ్మలను పేర్చి అందంగా తీర్చిదిద్దారు. నూతన వస్త్రాలు, నగలు ధరించి ఒక్క చోట చేరి బతుకమ్మ చుట్టు తిరుగుతూ పాటలు పాడుతూ ఆడడంతో పాటు యువతులు, మహిళలు కోలాటం ఆడారు. పట్టణంలోని రావులవాడ, కన్య కాపరమేశ్వరి ఆలయం, పొట్టి శ్రీరాములు చౌక్, కంచుకోట, తారక రామానగర్, రాజంపేట, సాయినగర్, పైకాజీనగర్, బజార్‌వాడీ, హడ్కో కాలనీ, సందీప్‌నగర్, జన్కాపూర్, దస్నాపూర్‌లో కాలనీల్లో మహిళలు ఆడి పాడారు. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు జిల్లాలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, తిర్యాణి మండలాల్లో మహిళలు ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం సద్దుల బతుకమ్మ పండు గను మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. రంగు రంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసి గౌరమ్మను



ఆరాధించారు. బతుక మ్మ చుట్టూ ఆటలు ఆడి, జానపద గీతాలతో సాంస్కృతిక సొగసును ప్రతిబింబిస్తూ కాగజ్‌నగర్‌లో సద్దుల బతుకమ్మ ఉత్సవం ఘనంగా సాగింది.

బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రానికి ప్రతీక అని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. సోమవారం ఎస్పీఎం క్రీడా మైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Pri- ted at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com